

నల్లమందు గోడౌన్‌లో తనిఖీలు

దుర్గి: పోలేపల్లి గ్రామ శివారులో ఉన్న నల్ల మందు గోడౌన్‌లో మంగళవారం గురజాల ఆర్డీఓ మురళి తనిఖీలు నిర్వహించారు. పరిసరాలను పరిశీలించారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ నుంచి 7,004 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 48,286 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 40,985 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

62 మందికి నోటీసులు

మాచర్ల: గురజాలలో జరిగే అన్నదాత పోరు కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి తరలిందుకు సిద్ధమైన 62మందికి ముందస్తుగా పోలీసులు నోటీసులు అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు, మాచర్ల పట్టణంలో ఏడుగురికి, మాచర్ల రూరల్ మండలంలో 31 మందికి, కారంపూడి, రెంటచింతల, దుర్గి, వెల్దుర్తి మండలాల్లో 21 మందికి ముందస్తుగా నోటీసులు అందజేశారు. కార్యక్రమానికి అనుమతి లేదని, కార్యక్రమానికి వెళితే కేసు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేసి గురజాల ఆర్డీఓ కార్యాలయానికి ఎవరిని అనుమతించకుండా అడ్డుకున్నారు.

యూరియా అక్రమ రవాణాపై కేసు నమోదు

ఆటో, 20 యూరియా బస్తాలు సీజ్



నకరికల్లు: అక్రమంగా తరలిస్తున్న యూరియాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నకరికల్లు మండలం కుంకలగుంట నుంచి తెలంగాణాకు తరలిస్తుండగా మంగళవారం తనిఖీల్లో గుర్తించిన అధికారులు 6–ఏ కేసు నమోదు చేసి ఆటోను, యూరియా బస్తాలు సీజ్ చేసి నకరికల్లు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడులకు సంబంధించి అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుంకలగుంట గ్రామానికి చెందిన కత్తి వెంకట ఆంజనేయులు ద్వారా తెలంగాణాకు చెందిన రమావతు లచ్చు నాయక్, ఇస్లావత్ వెంకట్రావునాయక్‌లు ఆటోలో 20 బస్తాలు తరలిస్తున్నారు. అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిపై తనిఖీ చేస్తున్న పోలీసులు ఆటో ఆపి తనిఖీలు చేశారు. వారి వద్ద బిల్లులు లేకపోడంతో ఆటోను, 20 యూరియా బస్తాలను సీజ్ చేశారు. యూరియా తరలిస్తున్న వారిపై 6 ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ కె.పుల్లారావు తెలిపారు. దాడుల్లో ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డి, ఏఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడా పోటీలకు షెడ్యూల్ ఖరారు

సత్తెనపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 మొదటి దశ జిల్లా జట్ల ఎంపిక తేదీలను ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు సత్తెనపల్లిలో మంగళవారం విడుదల చేశారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ నెల 11న జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్, తూములూరులో సైక్లింగ్ ఎంపికలు, 12న సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, నరసరావుపేటలో ఆర్చరీ జట్ల ఎంపికలు జరుగుతాయన్నారు. 14న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెనిగండ్లలో మల్లఖంబ్ జట్ల ఎంపికలు, 15న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందిగామలో పుట్ బాల్, సెపక్ తక్రా జట్ల ఎంపికలు, ఏ.యమ్.జి కళాశాల, చిలకలూరిపేటలో జూడో, గట్కా జట్ల ఎంపికలు, గుంటూరు బీఆర్ స్టేడియంలో కలరియపట్టు, కురాష్ జట్ల ఎంపికలు, 16న గుంటూరు బీఆర్ స్టేడియంలో ఉషు, స్కాష్ జట్ల ఎంపికలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రేవేంద్రపాడులో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ జట్ల ఎంపికలు, 17న సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, నరసరావుపేటలో రైఫిల్ షూటింగ్, బాక్సింగ్, చెస్ జట్ల ఎంపికలు, 18న గుంటూరు బీఆర్ స్టేడియంలో జిమ్నాస్టిక్స్, తైక్వాండో జట్ల ఎంపికలు, 19న ఏఎంజీ కళాశాల, చిలకలూరిపేటలో నెట్‌బాల్ జట్ల ఎంపికలు, గుంటూరు బీఆర్ స్టేడియంలో టంగ్టా మార్షల్ ఆర్ట్స్, స్కేటింగ్ జట్ల ఎంపికలు జరుగుతాయని తెలిపారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పని చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికను రూపొందించుకుని అమలు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు పేర్కొన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే నిధులతోపాటు గ్రామాల్లో సొంతంగా నిధులు సమకూర్చుకునే విధానాన్ని పాటించాలన్నారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై కదంతొక్కిన కర్షకులు

- 'అన్నదాత పోరు'కు తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు
- అడుగడుగునా ఆంక్షలు

యూరియా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టలేని ప్రభుత్వం..యూరియా ఇవ్వాలని కోరుతూ పోరుకు దిగిన అన్నదాతలపై ఉక్కుపాదం మోపింది. యూరియా కోసం పొలం పనులు మానుకుని రైతులు పడిగాపులు పడుతున్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన వైఎస్సార్ సీపీ పోరుకు పిలుపునిచ్చింది. పోరుకు రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు హాజరుకాకుండా పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. నాయకులను ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. పలువురికి నోటీసులు అందజేశారు. అయినా వాటిని లెక్క చేయకుండా వేలాది మంది రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు పోరులో పాల్గొని నిరసన తెలిపారు.

కూటమి ప్రభుత్వానికి భవిష్యత్తు లేదు

- ఆర్డీఓ కార్యాలయానికి ర్యాలీగా రాకుండా అడ్డుకున్న పోలీసులు
- రెండు వాహనాలకే అనుమతి ఇచ్చిన పోలీసులు
- ఆర్డీవో కార్యాలయానికి వేర్వేరుగా చేరుకున్న డాక్టర్ గోపిరెడ్డి, విడదల రజిని, బొల్లా
- పల్నాడు జిల్లాలో యూరియా ఎవరికి, ఎంత ఇచ్చారో లెక్కలు చెప్పగలరా?
- టీడీపీ నాయకులు ఇళ్లల్లో సొసైటీ యూరియా
- అర్ధరాత్రి పోలీసుల తనిఖీలు ఎందుకు
- రైతు సమస్యలపై నరసరావుపేట ఆర్డీఓ మధులతకు వినతిపత్రం అందజేత



ఆర్డీఓ మధులతకు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి, విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడు

నరసరావుపేట: రైతుల ఉసురు పోసుకున్న ప్రభుత్వాలకు భవిష్యత్తు ఉండదని, రైతులకు కన్నీళ్లు పెట్టించిన ఈ కూటమి ప్రభుత్వం పడిపోవటం ఖాయమని, ఇప్పటికైనా రైతుల గోడు దయచేసి వినాలని పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వినుకొండ, చిలకలూరిపేట నియోజకవర్గాల సమన్వయకర్తలు విడదల రజని, బొల్లా బ్రహ్మనాయుడు కోరారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం రైతుల సమస్యలు ప్రభుత్వానికి విన్నవించేందుకు ఆర్డీఓ కె.మధులతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ రైతుల సమస్యలపై శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తామని, ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తామని మూడురోజుల నుంచి పోలీసు అధికారుల అనుమతి కోసం లెటర్లు పంపించామన్నారు. మీరు శాంతియుతంగా ర్యాలీ చేసుకోండని మౌఖికంగా అనుమతి ఇచ్చి, ర్యాలీ చేయటానికి, పాల్గొనటానికి వీల్లేదని సోమవారం రాత్రి 11 గంటలకు నోటీసులు ఇచ్చారన్నారు. ఇది కేవలం వైఎస్సార్ సీపీకి మంచి పేరు వస్తుందని, రైతు ర్యాలీ విజయవంతమైతే కూటమి ప్రభుత్వ గుట్టురట్టువుతుందనే ఉద్దేశంతో చంద్రబాబు, లోకేష్‌లు రైతు ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేశారని అన్నారు. అయినప్పటికీ పోలీసులకు భయపడకుండా మూడు నియోజకవర్గాల నుంచి రైతులు పెద్ద ఎత్తున హాజరయ్యారన్నారు. యూరియాను రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లాలో 30 వేల టన్నుల ఇచ్చామని అధికారులు చెప్తున్నారని, ఎవరెవరికి ఎంత ఇచ్చారు, ఏ గ్రామానికి ఎంత ఇచ్చారనేది లెక్కలు చెప్పాలని ప్రశ్నించారు. సొసైటీలకు ఇచ్చి గ్రామాలకు పంపించామని అధికారులు చెబుతున్నారని, ఆ యూరియాని టీడీపీ నాయకులు ఇళ్లల్లో పెట్టుకొని రైతులను టీడీపీ నాయకుల దగ్గరికి వెళ్లి సంతకం పెట్టించుకునిరా అంటూ వెనక్కి పంపిస్తున్నారని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రానికి ఫోను చేస్తే వాళ్లకు ఎంత కావాలో అంత ఎరువులు ఇచ్చి పంపించామన్నారు. ఇప్పుడు ఆర్‌బీకేలు, సచివాలయాలను నిర్వీర్యం చేసి రైతులను వేధిస్తున్నారన్నారు. యూరియా బ్లాక్‌లో తరలి వెళ్లకపోతే అర్ధరాత్రి పొందుగల చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు ఎందుకు చెకింగ్ చేస్తున్నారని ప్రశ్నించారు. నాగార్జునసాగర్ కుడి కాలువ నీటిని ఆయకట్టు రైతులకు నీరు అందకుండా టెయిల్ పాండ్‌కు తరలిస్తున్నారని అన్నారు.

రైతులను దగా చేస్తున్న సీఎం చంద్రబాబు

మాజీ మంత్రి విడుదల రజని మాట్లాడుతూ చంద్రబాబు రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. యూరియా ఒక పెద్ద సమస్యగా మార్చారని, సీజన్ వచ్చినప్పటికీ రాష్ట్రంలో ఎక్కడ యూరియా గ్రామస్థాయిలో అందుబాటులో లేకుండా చేశారన్నారు. రైతన్నలకు పార్టీ ముద్రవేసి ఎరువులు అందకుండా చేస్తున్నారని, దీన్ని నియంత్రించాలని తాము ఆర్డీవో వినతిపత్రం ఇచ్చామన్నారు. రాష్ట్రంలో రైతులు రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడి అవమానాలు పాలవుతున్నారని, యూరియా అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారని, గ్రామస్థాయిలో ఎక్కడ రైతులకు ఇవ్వటం లేదని, బ్లాక్ మార్కెట్లో తప్ప రైతులకు దొరకటంలేదని చెప్పారు. తక్షణమే బ్లాక్ మార్కెట్ అరికట్టాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



ఆర్డీఓ కార్యాలయానికి తరలివస్తున్న డాక్టర్ గోపిరెడ్డి, విడదల రజని, బొల్లా బ్రహ్మనాయుడు

పంటలకు గిట్టుబాటు ధర లేదు

వైఎస్సార్ సీపీ వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని అన్నారు. యూరియా సరఫరా చేయమని అడగటానికి రైతులు రోడ్డు మీదకు వస్తే వారికి మద్దతుగా వచ్చిన తమను రౌడీలుగా చిత్రీకరిస్తూ పోలీసులు అర్ధరాత్రి ఒంటిగంటకు తమ ఇళ్లకు వచ్చి అరెస్టు చేశారని, ప్రతిపక్షంలో ఉన్న నాయకుడికి ఇంటికి ఒంటిగంటకు వచ్చి నిద్రలేపి అరెస్టు చేస్తారా? ఇది కరెక్టేనా అనేది చంద్రబాబు ఆలోచించాలన్నారు. శ్యావలాపురం మండలంలో 20 టన్నులు యూరియా ఇచ్చామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారని, ఒక్కో రైతుకు ఒక టన్ను ఎరువులు అవసరం ఉందని, 20 టన్నులు ఇచ్చి అందరికీ అందుబాటులో ఉందని ఎలా చెప్తారని ప్రశ్నించారు. రైతులు వినుకొండ నుంచి బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. నరసరావుపేట, మాచర్ల నియోజకవర్గాల రాష్ట్ర కార్యదర్శి గుత్తికొండ అంజిరెడ్డి, రైతు విభాగ జిల్లా అధ్యక్షులు అన్నెంపున్నారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, నరసరావుపేట పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షులు అచ్చిశివకోటి, జిల్లా కోశాధికారి అన్నామోహన్, మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బొబ్బిలి శ్రీలక్ష్మి, నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ బూదాల కల్యాణ్, నరసరావుపేట, రొంపిచర్ల మండల కన్వీనర్లు తన్నీరు శ్రీనివాసరావు, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ భవనం నరిసిరెడ్డి, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటప్పారెడ్డి, మూడు నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పల్నాడులో ప్రజాస్వామ్యం లేదు



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న గౌతమ్‌రెడ్డి, పార్టీ నాయకులు

- రైతులకు సత్వర న్యాయం చేయాలి
- వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంటరీ పరిశీలకుడు గౌతమ్‌రెడ్డి

గురజాల: గురజాల: పల్నాడు ప్రాంతంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పూనూరి గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల సమస్యలపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు గురజాల ఆర్డీఓ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పోలీసులు అడుగడుగునా ఆటంకాలు కల్పించడంతో ఆయన ద్విచక్రవాహనంపై ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు గ్రామాల్లో ఎరువులకు కృత్రిమంగా కొరత సృష్టిస్తున్నారని అన్నారు. అవసరం మేరకు యూరియా ఇవ్వకుండా తక్కువ ఇచ్చి సర్దుకోండి అని అనడం విడ్డూరంగా ఉందన్నారు. యూరియా అతిగా వాడవద్దని చంద్రబాబు చెప్పడం ఆయనకు మతి పోయిందని అర్థమవుతుందని అన్నారు. మార్కెట్‌లో యూరియా ధర రూ.250 ఉండగా బ్లాకు మార్కెట్‌లో రూ.600లకు పైగా అమ్ముతున్నారని అన్నారు. కూటమి నాయకులకు అనుకూలంగా ఉన్న వారికే యూరియా అందిస్తున్నారని పేర్కొన్నారు. యూరియా బ్లాకు మార్కెట్‌లో ఎక్కడ అమ్ముతున్నారో పోలీసులకు, వ్యవసాయాధికారులకు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. రైతులను మోసం చేస్తే కూటమి ప్రభుత్వం కుప్పకూలక తప్పదన్నారు. శాంతియుతంగా వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమైన గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలను పోలీసులు హౌస్ అరెస్టు చేయడం దారుణమన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఈవోకు వినతిపత్రం అందించారు. అనంతరం స్థానిక బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద గల దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు వి.అమరారెడ్డి, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, మండల కన్వీనర్ కొమ్మినేని బుజ్జి, వేముల చలమయ్య, కర్రా చిన కోటేశ్వరరావు, కౌన్సిలర్ పోలు వీరారెడ్డి, దేవండ్ల వెంకటనారాయణ, కర్రా గిరిబాబు, కొమ్మినేని రవిశంకర్, జక్కా సత్యనారాయణ, మహంకాళి యశోద దుర్గా, చల్లా కాశీబాబు తదితరులున్నారు.



వినతి పత్రం ఇచ్చేందుకు ర్యాలీగా వస్తున్న గౌతమ్‌రెడ్డి తదితరులు

అన్నదాతల పాలిట శాపంగా చంద్రబాబు ప్రభుత్వం

- సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన
- హాజరైన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి
- ఆర్డీఓ రమణాకాంతరెడ్డికి వినతిపత్రం అందజేత



ఆర్డీవో కార్యాలయానికి ప్రదర్శనగా వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు, గజ్జల, యెనుముల, పడాల, రైతులు

సత్తెనపల్లి: రాష్ట్రంలో అన్నదాతల పాలిట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం శాపంగా మారిందని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విమర్శించారు. ఎరువులు బ్లాక్ మార్కెట్, యూరియా కొరతపై రైతులకు బాసటగా వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అన్నదాత పోరు పేరిట సత్తెనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పోరును అడ్డుకునేందుకు పోలీసులు ఆంక్షలు విధించడం, అర్ధరాత్రి వేళ నాయకులను హౌస్ అరెస్టులు చేసి నోటీసులు ఇవ్వడం వంటివి చేసినప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట పెద్ద పెట్టున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అనంతరం ఆర్డీఓ జీవీ రమణాకాంతరెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం రైతులనుద్దేశించి నంబూరు శంకరరావు మాట్లాడుతూ అరకొరగా వచ్చిన యూరియాను కూడా రైతులకు ఇవ్వకుండా తమ పార్టీవారికే ఇస్తూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ కూడా రైతులు యూరియా కోసం లైనుల్లో నిల్చున్న పరిస్థితి తాము చూడలేదన్నారు. ఇప్పటికైనా రైతులను కాపాడండి, రైతులను బతకనీయండి, రైతు బతికితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం దిగి వచ్చి ప్రతి రైతుకు యూరియా అందేలా చూడాలన్నారు.

- వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంటలు బాగా పండి రైతులందరూ సంతోషంగా జీవించారన్నారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో యూరియా కొరత అధికంగా ఉందని అన్నారు. ముందు టీడీపీ వారికి ఇస్తాం, వాళ్ల తరువాత మీరు రండి.. దయచేసి మాపై ఒత్తిడి చేయవద్దు, మా వద్దకు రావద్దని చెప్పి ఒక అధికారి మాట్లాడడం చాలా దారుణంగా ఉందన్నారు. ముప్పాళ్ల మండలం మాదలలో రైతు ఆత్మహత్య చేసుకున్నాడని, అతని ఆత్మహత్యకు కూటమి ప్రభుత్వమే కారణమని పేర్కొన్నారు. రైతులు రోడ్డెక్కారంటే కేవలం కూటమి ప్రభుత్వం చేతకానితనమేనన్నారు.
- వైఎస్సార్ సీపీ పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకుడు యెనుముల మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కడం ఎప్పుడూ చూడలేదన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించడం జరిగిందన్నారు. రైతులు పండించిన పంటకు ఇన్స్యూరెన్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక క్రాప్ ఇన్స్యూరెన్సు గాలిలో కలిసి పోయిందని, మద్దతు ధర లేకుండా పోయిందన్నారు.
- సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకుడు పడాల శివారెడ్డి మాట్లాడుతూ ఏడాదిన్నర కూటమి పాలనలో రైతుల నడ్డివిరిచిందన్నారు. రైతులకు ఎరువులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా యూరియాను రైతులకు సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫల మైందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంతరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రైతులను ఇబ్బంది పెట్టే ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్ల: రాష్ట్రంలో రైతులు యూరియా కోసం పలు ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఇబ్బంది పెట్టే ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చలేక కూటమి ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. రూ.3,300 కోట్లు యూరియా స్కామ్ దాగి ఉందన్నారు. రాష్ట్రానికి ఏడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు రైతుల గోడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల సమస్యలపై తలపెట్టిన అన్నదాత పోరులో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొనకుండా ముందస్తుగా హౌస్ అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతామన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే కూటమి నేతలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు పార్టీల పేరు పెట్టి యురియాను పంపిణీ చేయడం సరైంది కాదన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వర్గం, పార్టీ, మతం, కులం చూడకుండా అన్ని వర్గాలకు సమ న్యాయం చేశారని గుర్తు చేశారు. యూరియా కోసం క్యూలైనుల్లో ఉంటే అధికారులు టీడీపీ వారికి వచ్చిన అనంతరం మీకు ఇస్తామనడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. యూరియాను కూటమి నేతలు గోదాముల్లోకి తరలించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేందుకు నిల్వ లేదని చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు చేపట్టాలన్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు రైతులకు న్యాయం జరిగేలా యూరియా అందించాలని డిమాండ్ చేశారు.



నరసరావుపేటలోని గుంటూరురోడ్డులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయం ఎదుట కాపలా కాస్తున్న పోలీసులు



నరసరావుపేటలో పార్టీ కార్యాలయం నుంచి డాక్టర్ గోపిరెడ్డి, నాయకులను బయటకు రాకుండా అడ్డుకుంటున్న సీఐ హైమారావు



సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలోకి వెళ్లే సమయంలో రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



సత్తెనపల్లి పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

అన్నదాత పోరుపై

పోలీసు నిర్బంధం

ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి రైతులందరికి యూరియా సరఫరా చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ చేపట్టిన అన్నదాత పోరుకు పోలీసులు అడుగడుగునా అడ్డంకులు కల్పించారు. మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి, కాసు, నంబూరు, బొల్లా తదితరులను గృహ నిర్బంధం చేశారు. అడుగడుగునా పోలీసులను మోహరించి పార్టీ నాయకులు, కార్యకర్తలను నిరసన కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు.

-సాక్షి, నెట్‌వర్క్



సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద రోడ్డుకు అడ్డుగా తాడుకడుతున్న పోలీసులు



మాజీ ఎమ్మెల్యే కాసుకు నోటీసులు జారీ చేస్తున్న పోలీసులు



గురజాలలో ఆటోలను క్షుణ్ణంగా పరిశీలించి పంపుతున్న పోలీసులు



సత్తెనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త చల్లంచర్ల సాంబశివరావును హౌస్ అరెస్ట్ చేసి కాపలా ఉన్న పోలీసులు



గురజాలలో ద్విచక్రవాహనదారులను తనిఖీ చేస్తున్న పోలీసు



గురజాల ఆర్డీవో కార్యాలయం వద్ద బారికేడ్లు ఏర్పాటుచేసిన పోలీసులు

అడుగడుగునా అడ్డంకులు

గురజాల: గురజాలలో వైఎస్సార్ సీపీ తలపెట్టిన అన్నదాత పోరుకు పోలీసులు అడుగడునా అడ్డంకులు కల్పించారు. సోమవారం రాత్రి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులను గృహ నిర్బంధం చేశారు. మంగళవారం ఉదయం గురజాలకు వచ్చే అన్ని మార్గాలను మూసి వేసి పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. కొత్త వ్యక్తులు ఎవ్వరూ పట్టణంలోకి అడుగుపెట్టనీయకుండా అడుగడునా తనిఖీలు నిర్వహించారు. కొద్ది మంది నాయకులు, రైతులు పోలీసుల ఆంక్షలను అధిగమించి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు నోటీసులు జారీ చేశారు.

ప్రజల పక్షానే ఉంటాం



మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉండి పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ఎల్లప్పుడు ప్రజల పక్షానే ఉంటామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో వ్యవసాయం పండుగ సాగిందని,



వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పోలీసులు

చంద్రబాబు పాలనలో దండగలా ఉందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో, యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. శాంతియుతంగా ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తామంటే పోలీసులను అడ్డుపెట్టి వినతిపత్రం ఇవ్వకుండా చేశారన్నారు. రైతులకు న్యాయం చేయాలని రైతుల సమస్యలను సత్వరమే కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గృహ నిర్బంధం



గుంటూరులోని ఇంటి వద్ద మాజీ ఎమ్మెల్యే నంబూరుకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

పెదకూరపాడు: పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును గుంటూరు పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి అనుమతులు లేనందున ఆ కార్యక్రమానికి మీరు వెళ్లకూడదంటూ నంబూరు శంకరరావుకి నోటీసులు ఇచ్చారు. నంబూరు శంకరరావు మాట్లాడుతూ రైతు సమస్యలపై వినతిపత్రం అందజేయడానికి వెళ్తుంటే కూటమి ప్రభుత్వం ఇలా హౌస్ అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం రావణకష్టం అయ్యిందన్నారు. రైతులు ఎరువుల కోసం ఎండలో పడికాపులు కాస్తున్నారన్నారు. వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ నాయకులను కార్యకర్తలను ఇలా అరెస్ట్ చేసి ఆపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎంతమంది ఎన్ని ఇబ్బందులు పెట్టిన రైతులు, ప్రజలు పడుతున్న సమస్యలపై వైఎస్సార్‌సీపీ పోరాడుతూనే ఉంటుందని నంబూరు తెలిపారు.

ఆటోడ్రైవర్‌కు 18నెలల జైలు

అమరావతి: అమరావతికి చెందిన తురకా కిరణ్ భార్య కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై 2018 నవంబర్ 28వ తేదీ రాత్రి విజయవాడ నుంచి అమరావతి వస్తుండగా పెద్దమద్దూరు వాగు చప్టా వద్ద అమరావతి నుంచి విజయవాడ వెళ్లే ఆటోడ్రైవర్ హుమాయున్‌బాషా ఆటోను అతి వేగంగా అజాగ్రతగా నడిపి కిరణ్ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీ కొట్టాడు ఈ ప్రమాదంలో కిరణ్, అతని భార్య, కుమారుడు ఋషికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఋషికుమార్ చనిపోయాడు. అప్పట్లో అమరావతి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఫిర్యాది తరుపున లాయర్ ప్రసాద్‌నాయక్ వాదనలు వినిపించగా మంగళవారం సత్తెనపల్లి 2వ అదనపు సివిల్ జడ్జి ఓ.సృజన్‌కుమార్ నిందితునికి 304(అ) సెక్షన్‌తోపాటుగా 338 సెక్షన్‌ల ప్రకారం 18 నెలలు జైలు శిక్ష, రూ.11,000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

15 నుంచి విద్యారంగ సమస్యలపై రణభేరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నరసరావుపేట: ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న 'యూటీఎఫ్ రణభేరి' కార్యక్రమానికి జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం యూటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యాలయంలో రణభేరి పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్సు సమస్యకు పరిష్కారం చూపడం లేదని బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లో కొనసాగుతున్నారని అన్నారు. మూడు నెలలుగా మినిమం టైం స్కేలు టీచర్లకు జీతాలు లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రపంచబ్యాంక్ సాల్ట్ పథకం రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా మూడో వంతు ప్రైమరీ స్కూళ్లు ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారిపోయాయని, సగంపైన హైస్కూళ్లు సింగిల్ సబ్జెక్టు టీచరు స్కూళ్లుగా తయారయ్యాయని తెలిపారు. హైస్కూళ్లలో పనిచేయాల్సిన స్కూలు అసిస్టెంట్లు సర్ ప్లస్ పేరుతో క్లస్టరు టీచర్లుగా, ప్రైమరీ స్కూలు హెడ్మాస్టర్లుగా పనిచేయాల్సిన పరిస్థితులు కల్పించారని తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ ఖాసిం పీర, కోశాధికారి రవిబాబు, జిల్లా సహాధ్యక్షురాలు భాగేశ్వరీదేవి, జిల్లా కార్యదర్శులు తిరుపతిస్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ప్రశ్నించే అధికారం లేదా ?

- మాజీ మంత్రి విడదల రజిని
- అన్నదాత పోరు కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులు



పోలీసులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ప్రజాస్వామ్యంలోనే ఉన్నాంకదా... రైతుల సమస్యలపై శాంతియుతంగా కార్యక్రమం చేపడితే అడ్డుకోవడం ఏమిటి... ఇది నియంతృత్వాన్ని తలపిస్తోంది అంటూ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకురాలు విడదల రజిని విమర్శించారు. అన్నదాత పోరు కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమౌతున్న మాజీ మంత్రి విడదల రజినిని పోలీసులు మంగళవారం ఆమె నివాసం వద్ద అడ్డుకొని నోటీసులు అందించారు. అన్నదాత పోరు కార్యక్రమానికి అనుమతులు లేవని మాజీ మంత్రికి పోలీసులు తెలిపారు. ఉదయం నుంచే చిలకలూరిపేట పట్టణ ఎస్ఐ డి చెన్నకేశవులు, రూరల్ ఎస్ఐ జి అనిల్‌కుమార్, నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు సిబ్బందితో కలసి మాజీ మంత్రి నివాసానికి చేరుకున్నారు. కార్యక్రమానికి బయలుదేరిన ఆమెను వెళ్లవద్దంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ దశలో మాజీ మంత్రి పోలీసుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా కూడా రైతుల కోసం నిరసన కార్యక్రమం నిర్వహించే అవకాశం కూడా ఎందుకు లేదంటూ ప్రశ్నించారు. తాము ప్రజలను పోగు చేయలేదని, కేవలం పార్టీ నాయకులతో కలసి నరసరావుపేటకు వెళ్లి ఆర్డీవోకు రైతుల సమస్యలతో కూడిన మెమోరాండం ఇచ్చేందుకు మాత్రమే వెళుతున్నామని, ఇక్కడ శాంతిభద్రతలకు విఘాతం కలిగే సమస్య ఎక్కడుందని పోలీసులను నిలదీశారు. ప్రభుత్వం సకాలంలో రైతులకు యూరియా కూడా అందజేయలేని పరిస్థితుల్లో ఉంటే ప్రతిపక్షంలో ఉన్న మేము ఎందుకు ప్రశ్నించకూడదన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమానికి ఖచ్చితంగా వెళ్లి తీరుతామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు తమ ఉన్నతాధికారులతో మాట్లాడి చెబుతామని చెప్పి, ఉన్నతాధికారులతో చర్చించి రెండు కార్లు మాత్రమే వెళ్లేందుకు అనుమతించారు. దీంతో రెండు కార్లలో ఆమె నరసరావుపేటకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల, యడ్లపాడు, నాదెండ్ల మండలాల అధ్యక్షులు షేక్ దరియావలి, దేవినేని శంకరరావు, వడ్డేపల్లి నరసింహరావు, మంగు ఏడు కొండలు, పార్టీ వివిధ విభాగాల నాయకులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే బొల్లా గృహ నిర్బంధం



బొల్లాను ఇంటి నుంచి బయటకు రాకుండా కాపలా ఉన్న పోలీసులు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ: వినుకొండ మాజీ ఎమ్మెల్యే, పీఏసీ సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని కోరుతూ వైఎస్సార్ సీపీ తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి వెళ్లకూడదంటూ పోలీసులు అర్ధరాత్రి నోటీసులు అందజేశారు. తెల్లవారుజామునే బొల్లా ఇంటికి చేరుకున్న పోలీసులు ఆయన బయటకు రాకుండా బందోబస్తు నిర్వహించారు. రైతు పోరుకు అనుమతులు లేవని చెబుతూనే మధ్యాహ్న సమయంలో షరతులతో కూడిన అనుమతులు ఇవ్వడం గమనార్హం.

అడ్డుకోవడం దారుణం

మాజీ ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలు పట్టించుకోకుండా మాజీ ముఖ్యమంత్రి రైతుల పక్షాన ఆర్డీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇవ్వడానికి వెళుతుంటే అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రతిపక్షం ప్రజల పక్షాన అడిగే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. రైతులకు కనీసం యూరియా కూడా అందించలేని పరిస్థితిలో ప్రభుత్వ పనితీరు ఉందని ఎద్దేవా చేశారు. రైతులు పండించిన టమటో, ఉల్లి, పొగాకు, కందులు, మామిడి, ధాన్యం వంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేకపోయారని విమర్శించారు. గత ప్రభుత్వం హయాంలో రైతు భరోసా కేంద్రాల నుంచి కొనుగోలు చేశారని గుర్తు చేశారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటుంటే చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌కు తెలియదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలను చూసి ప్రభుత్వం భయపడుతోందని అన్నారు. రైతులకు ఎలాంటి న్యాయం చేయలేని ప్రభుత్వం వారి సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్షపార్టీ నాయకులను అక్రమ అరెస్ట్‌లు చేస్తున్నారని అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు యూరియా వస్తుందని అంటున్నారని యూరియా ఎక్కడ ఉందో చూపించాలని డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని అక్రమ అరెస్టులతో ఆపలేరని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. అనంతరం పోలీసుల అనుమతితో ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే అన్నదాత పోరులో పాల్గొనేందుకు వెళ్లారు.

డైట్‌లో 11 నుంచి కళాఉత్సవ్

యడ్లపాడు: ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి, డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎల్ చంద్రకళ చెప్పారు. మండలంలోని డైట్ కళాశాలలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. పది, 11, 12 తరగతులు చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. యడ్లపాడు మండలం బోయపాలెంలోని జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో జరిగే కళా ఉత్సవ్ పోటీల కింద మొత్తం 12 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. నృత్య ప్రదర్శన, సంగీతం, ఏకపాత్రాభినయం వంటి రంగాల్లో జరిగే ఈ పోటీలు తొలిరోజు 6 విభాగాల్లో రెండోరోజున మిగిలిన ఆరు విభాగాల్లో పోటీల నిర్వహణ కొనసాగుతుందన్నారు. వీటిలో విజేతలైన వారిని రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలలో పాల్గొనే అర్హత లభిస్తుందన్నారు. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా నుండి 130 మంది విద్యార్థుల నుండి పోటీలకు సంబంధించి రిజిస్టర్లు చేసుకున్నట్లు వెల్లడించారు. ఉన్నత పాఠశాలలు హెచ్‌ఎంలు, కళాశాలల ప్రిన్సిపల్స్ తమ సంస్థల్లోని విద్యార్థులను పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లు చిలకలూరిపేటకు తరలింపు ఆపాలి

- సీఎండి పుల్లారెడ్డికి వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, బొల్లా
- ఎమ్మెల్యే పత్తిపాటి మెప్పుకోసమే చేయటం తగదు



కార్యాలయంలో సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి, బొల్లా

నరసరావుపేట: దశాబ్దాలుగా నరసరావుపేట విద్యుత్ సబ్‌డివిజన్‌లో కొనసాగుతున్న నకరికల్లు, రొంపిచర్ల, ఈపూరు, శావల్యాపురం మండలాల విద్యుత్ సబ్‌స్టేషన్లను నూతనంగా ఏర్పాటు చేయనున్న చిలకలూరిపేట విద్యుత్ సబ్‌డివిజన్‌లో కలపడానికి నిరసిస్తూ తక్షణమే ఈ ప్రక్రియను నిలిపివేయాలని నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం విద్యుత్‌శాఖ జిల్లా కార్యాలయంలో సీఎండీ పి.పుల్లారెడ్డి, ఎస్ఈ ప్రత్తిపాటి విజయకుమార్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మీడియాతో మాట్లాడుతూ పై మండలాల విద్యుత్ సబ్‌స్టేషన్లను నరసరావుపేట సబ్‌స్టేషన్ నుంచి తొలగించి చిలకలూరిపేట సబ్‌డివిజన్‌కు తరలించడం దారుణమైన విషయమని అన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణానికి కూత వేటు దూరంలో ఈ నాలుగు మండలాలు ఉన్నాయని, ఇక్కడే విద్యుత్ డీఇ, ఎస్ఇ, ఈఈలతోపాటు జిల్లా కలెక్టర్ కార్యాలయాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే ఇక్కడికి వచ్చి వీరిని కలిసి సమస్యలు విన్నవించుకోవడం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అన్ని కార్యాలయాలు ఇక్కడ పెట్టుకుని ఇక్కడి ప్రజలు చిలకలూరిపేటకు వెళ్లి సమస్యలు విన్నవించుకోవడం హాస్యాస్పదంగా ఉంటుందన్నారు.

కేవలం చిలకలూరిపేట శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు మెప్పుకోసం చిలకలూరిపేటలో సబ్ డివిజన్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారని, వారికి అంతగా కొత్త సబ్ డివిజన్ ఏర్పాటు చేసుకోవాలని ఉంటే అక్కడున్న మండలాలను కలుపుకొని చేసుకోవాలే తప్ప మా నియోజకవర్గాలకు చెందిన మండలాలను తీసుకువెళ్లి అటు కలపడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తమ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అవసరమైతే ధర్నాలు చేయడానికి, న్యాయపోరాటానికి సైతం వెనుకాడబోమని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.